క్లుప్తంగా

పరీక్షకు 595 మంది విద్యార్థులు హాజరు

హుజూర్‌నగర్ : పట్టణంలో రెండు పరీక్ష కేంద్రాలలో సోమవారం నిర్వహించిన ఇంటర్ పరీక్షకు 632 విద్యార్థులకు 37 మంది గైర్హాజరు కాగా 595 మంది విద్యార్థులు హాజరయ్యారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 261 మంది విద్యార్థులకు 21 మంది గైర్హాజరు కాగా 240 మంది విద్యార్థులు హాజరయ్యారు. ప్రియదర్శినీ కళాశాలలో 387 మంది విద్యార్థులకు 16 మంది గైర్హాజరు కాగా 371 మంది మంది విద్యార్థులు హాజరైనట్లు అధికారులు తెలిపారు.

సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో జయ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులతో ప్రధానోపాధ్యాయుడు వేణు

కోదాడ : యూనిఫైడ్ కౌన్సిల్ జాతీయ స్థాయిలో నిర్వహించిన సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో కోదాడలోని జయ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపి వందలోపు ఇరవై ర్యాంకులు సాధించినట్లు పాఠశాల నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 7వ తరగతి విద్యార్థి కె.శ్రీచరణ్ 15వ ర్యాంక్, 8వ తరగతి విద్యార్థి జి.లలితాదిత్య 50వ ర్యాంక్, 9వ తరగతి విద్యార్థి బి.అక్షయ్‌కుమార్ 37వ ర్యాంక్, 10వ తరగతి విద్యార్థి జి.లోకేష్ 49వ ర్యాంక్ సాధించినట్లు పేర్కొన్నారు. కాగా, ప్రతిభ చూపిన విద్యార్థులను కరస్పాండెంట్ జయవేణుగోపాల్, హెచ్‌ఎం చిలువేరు వేణు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రత్యేకంగా అభినందించారు.

సాగర్ నీటిని విడుదల చేయాలి

నడిగూడెం : సాగర్ నీటిని విడుదల చేయాలని మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు దేవబత్తిని వెంకటనర్సయ్య ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భూగర్భ జలాలు అడుగంటడంతో చెరువుల్లో నీరు లేకుండా పోయిందని, దీంతో వందల ఎకరాలలో వరి పంట ఎండిపోతుందని కావున సాగర్ నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలన్నారు.

విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్లు పంపిణీ



ప్యాడ్లు, పెన్నులు అందజేస్తున్న జానిమియా

మునగాల : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు సోమవారం రిటైర్డు ఉపాధ్యాయుడు షేక్ జానిమియా పెన్నులు, ప్యాడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పదవ తరగతిలో మంచి ఫలితాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దండు సీతారామరాజు, ఉపాధ్యాయులు షేక్ అబ్దుల్ సత్తార్, షేక్ ఫాతిమాబేగం, వి.గోవర్ధన్, వై.జ్యోతి, షేక్ జాఫర్, విద్యాభవాని, నారాయణరెడ్డి, పద్మ, ఉషారాణి పాల్గొన్నారు.

బాపూజీ శాఖ గ్రంథాలయం చైర్మన్‌గా శేషగిరిరావు



గరిణె శేషగిరిరావు

చిలుకూరు : చిలుకూరులోని బాపూజీ శాఖ గ్రంథాలయం నూతన చైర్మన్‌గా గ్రామానికి చెందిన గరిణె శేషగిరిరావు నియమితులయ్యారు. సోమవారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే పద్మావతి అంగీకారంతో, కాంగ్రెస్ పార్టీ నాయకుల సహకారంతో తనను చైర్మన్‌గా ఎన్నుకున్నట్లు తెలిపారు. గ్రంథాలయం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. తన నియామకానికి సహకరించిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. కాగా, గరిణె శేషగిరిరావు గతంలో కూడా చైర్మన్‌గా పనిచేశాడు.

ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను భర్తీ చేయాలి

నడిగూడెం : ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు కాసాని కిషోర్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం నడిగూడెం మండలంలోని బృందావనపురంలో నిర్వహించిన ఆ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. శిశు సంక్షేమం, వ్యవసాయ, ఉద్యానవన శాఖ, ఇంకా పలు శాఖల్లో అనేక పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ప్రభుత్వం స్పందించి ఖాళీలను భర్తీ చేయాలని ఆయన కోరారు.

సమాచారం ఇవ్వాలి

నేరేడుచర్ల : వరి కోతలు ప్రారంభమైనందున వ్యవసాయ పొలాల్లో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతూ కనిపిస్తే తమకు సమాచారం ఇవ్వాలని విద్యుత్ ఏఈ పందిరి శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. వరికోత మిషన్లకు విద్యుత్ తీగలు తగలకుండా రైతులు జాగ్రత్త వహించాలని సూచించారు.

పేదలవి కూల్చి.. పెద్దలవి వదిలేసి!



ఈ ఫొటో చూడండి. కోదాడ పట్టణ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో సామాజిక అవసరాల కోసం తీసిన భూమిలో కొందరు పేదలు గుడిసెలు వేసుకున్నారని ఫిర్యాదులు రావడంతో వారం రోజుల క్రితం రెవెన్యూ అధికారులు ప్రొక్లెయిన్‌తో వారి గుడిసెలను కూల్చివేశారు. కనీసం ఇంట్లోని వస్తువులను బయట పెట్టుకోవడానికి కూడా అంగీకరించలేదు. అందులో నివసిస్తున్నది వికలాంగుడు అని కూడా కనికరించకుండా అధికారులు కూల్చివేశారు.



ఈ ఫొటో గమనించండి. ఇందిరమ్మ కాలనీలో ఓ రాజకీయ నేత ఏకంగా మూడు వందల గజాల స్థలంలో భారీ షెడ్డు నిర్మించుకున్నాడు. దీంతో అధికారులు అక్కడికి వెళ్లి హడావుడి చేసి వెనక్కి వచ్చారు కానీ దాన్ని మాత్రం ముట్టుకోలేదు. ఈ స్థలం ప్రభుత్వానిదేనని కోదాడ రెవెన్యూ అధికారులు ధ్రువీకరించారు. అయినా దాని జోలికి వెళ్లలేదు. అయితే సదరు నేత పట్టా ఉందని చెపుతున్నాడు. ఇందిరమ్మ కాలనీలో ఒకరికి కేవలం 96 గజాల స్థలాన్ని మాత్రమే పట్టా ఇస్తారు. కానీ ఇక్కడ మూడు వందల గజాల స్థలంలో షెడ్డు వేయడం గమనార్హం.



ఇందిరమ్మ కాలనీలో పేదల గుడిసెలను తొలగిస్తున్న అధికారులు (ఫైల్)

ఆక్రమణల తొలగింపులో అధికారుల వింత వైఖరి

- మాయమవుతున్న ఇందిరమ్మ కాలనీలోని ప్రభుత్వ భూమి
- సమస్యగా రెవెన్యూ, మున్సిపాలిటీ అధికారుల మధ్య సమన్వయ లోపం

కోదాడ : పట్టణ పరిధిలోని లక్ష్మీపురంలో 52 ఎకరాల విస్తీర్ణంలో 2006– 07లో ఇందిరమ్మ కాలనీ ఏర్పాటు చేశారు. మొత్తం 1433 ఇళ్లకు లేఅవుట్ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఇదే అతిపెద్ద ఇందిరమ్మ కాలనీ. దానిలో 800 గృహాల వరకు నిర్మాణాలు పూర్తయ్యాయి. వాటిలో పలువురు నివాసం ఉంటున్నారు. మిగతా ఇళ్లు వివిధ దశలలో ఆగిపోయాయి. ఈ కాలనీలో పలు ఇళ్లు అనర్హుల చేతిలోకి వెళ్లినట్లు ఆరోపణలున్నా రాజకీయ కారణాలతో అధికారులు కూడా చూసి చూడనట్లు వదిలేస్తూ వచ్చారు. కొందరు రాజకీయ నేతలు పార్టీలకతీతంగా ఆక్రమణలకు తెగబడ్డారు. పలువురు ఆక్రమించి ఇతరులకు అమ్ముకుంటున్నా పట్టించుకునేవారు కరువయ్యారు.

మూడు వైపులా ఆక్రమణ

లక్ష్మీపురం కాలనీలో కాలనీ వాసుల సామాజిక అవసరాలకు, అన్ని మతస్తుల ఆలయాల కోసం అధికారులు మూడు ఎకరాల భూమిని తీసి ఉంచారు. దీనిపై కొందరి దృష్టి పడింది. మూడు వైపుల ఈ భూమిని ఆక్రమించడానికి ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఇప్పటికే చాలావరకు ఆక్రమణకు గురైంది. కాలనీ అవసరాల కోసం తీసిన భూమిలో గత ప్రభుత్వ హయంలో అక్కడ ప్రభుత్వ వసతి గృహాన్ని నిర్మించడానికి అనుమతి ఇచ్చారు. దీంతో అప్పుడే కాలనీవాసులు తీవ్రంగా వ్యతిరేకించారు. తమ కాలనీకి ఆ ప్రాంతంలో పాఠశాల నిర్మాణం చేయాలని కోరినా పట్టించుకోలేదని, ఇప్పుడు ఉన్న కాస్త భూమిని ఆక్రమించుకుంటున్నారని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇరు శాఖల సమన్వయ లోపంతో..

కోదాడ ఇందిరమ్మ కాలనీ నిర్మాణం పూర్తయి దాదాపు 15 సంవత్సరాలు కావస్తుంది. ప్రస్తుతం కాలనీ మొత్తం మున్సిపాలిటీ పరిధిలో ఉంది. కాలనీలో ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు జరిగితే మున్సిపాలిటీ అధికారులు పట్టించుకోవాలి కానీ సదరు కాలనీ భూమిని రెవెన్యూ అధికారులు సేకరించారని, ఆక్రమణలపై వారే చర్యలు తీసుకోవాలని మున్సిపాలిటీ అధికారులు చెప్పి తప్పించుకుంటున్నారు. కాలనీ మున్సిపాలిటీలో కలిసిపోయినందున అక్కడ ఏమి జరిగినా మున్సిపాలిటీదే బాధ్యత వహించాలని రెవెన్యూ అధికారులు అంటున్నారు. ఇరు శాఖల సమన్వయ లోపంతో ఆక్రమణలు యథేచ్ఛగా సాగుతున్నాయి.

ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు

ఇందిరమ్మ కాలనీలో ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించారని ఫిర్యాదులు రావడంతో పరిశీలించి ఆక్రమణలను తొలగించాం. కొంత మంది తమ ఆక్రమణలు తొలగించడానికి కొంత సమయం అడిగారు. వారు తొలగించకపోతే మేమే వాటిని పూర్తిగా తొలగిస్తాం. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు.

– సాయాగౌడ్, తహసీల్దార్, కోదాడ

కొనసాగుతున్న మహాశివరాత్రి జాతర



కబడ్డీ పోటీల్లో తలపడుతున్న ఇరు జట్లు

మేళ్లచెరువు : మేళ్లచెరువు మండల కేంద్రంలో మహాశివరాత్రి జాతర కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఆలయంలో శ్రీఇష్టకామేశ్వరీ సమేత శ్రీ స్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం వివిధ రకాల పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, స్వామివారికి మహన్యాసపూర్వక రుద్రాభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు, ఔపాసన, బలిహరణ, స్వామివారికి విశేష అలంకరణ, మహానివేదన, మంగళనీరాజనం, తీర్థ ప్రసాద వినియోగం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠభరితంగా ఎద్దుల పందేలు

మహాశివరాత్రి జాతర సందర్భంగా శివాలయం వద్ద నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ఎద్దుల పందేలు సోమవారం ఉత్కంఠభరితంగా సాగాయి. పందేలను చూడడానికి చుట్టపక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

మూడవరోజు కొనసాగిన కబడ్డీ పోటీలు

ఆలయం వద్ద ఐరా రియాల్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి పురుషులు, మహిళల కబడ్డీ పోటీలు సోమవారం మూడవరోజు కొనసాగాయి. ఈ పోటీలను తిలకించడానికి క్రీడాకారులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో వచ్చారు.



బండను లాగుతున్న గిత్తలు



శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

చిల్లేపల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా రమణారెడ్డి

- ఏకగ్రీవంగా ఎన్నుకున్న డైరెక్టర్లు



రమణారెడ్డికి నియామకపత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి ఇందిర

నేరేడుచర్ల: నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(పీఏసీఎస్)చైర్మన్‌గా కాంగ్రెస్ పార్టీకి చెందిన మలిగిరెడ్డి రమణారెడ్డి సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధికారి ఇందిర ఆధ్వర్యంలో ఈ ఎన్నిక నిర్వహించారు. ఈ పీఏసీఎస్‌లో మొత్తం 13 మంది డైరెక్టర్లు ఉండగా ఇటీవల చిల్లేపల్లికి చెందిన డైరెక్టర్ కొండ పిచ్చిరెడ్డి మృతి చెందారు. బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన చైర్మన్ అనంత్ శ్రీనివాస్ గౌడ్ గతనెల తన పదవికి రాజీనామా చేయడంతో వైస్ చైర్మన్ గంగ రంగారెడ్డిని ఇన్‌చార్జ్‌గా నియమించారు. ఇక చైర్మన్ ఎన్నికకు ఎన్నికల సంఘం ఈనెల 7న నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. చైర్మన్ ఎన్నికకు సోమవారం నిర్వహించిన సమావేశానికి వైస్ చైర్మన్ గంగ రంగారెడ్డి, డైరెక్టర్లు మలిగిరెడ్డి హేమలత, మలిగిరెడ్డి రమణారెడ్డి, పెద్ద పంగు ముత్తమ్మ, మాలోతు గోవింద్, పేర్వాల రంగారెడ్డి, బొజ్జ సైదమ్మ, పల్లా వెంకటయ్య హాజరయ్యారు. ఎన్నికల అధికారి నామినేషన్ల ప్రక్రియను ప్రారంభించారు. నేరేడుచర్ల మండలం దాచారం గ్రామానికి చెందిన పేర్వాల రంగారెడ్డి ..చింతకుంట్ల గ్రామానికి చెందిన డైరెక్టర్ మలిగిరెడ్డి రమణారెడ్డిని చైర్మన్ అభ్యర్థిగా ప్రతిపాదించగా కల్లూరుకు చెందిన డైరెక్టర్ బొజ్జ సైదమ్మ బలపర్చారు. చైర్మన్ పదవికి ఒక్కటే నామినేషన్ దాఖలు కావడంతో మలిగిరెడ్డి రమణారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారి ప్రకటించిన అనంతరం నియామక పత్రం అందజేశారు. తర్వాత ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో సీఈఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల హర్షం

చిల్లేపల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా రమణారెడ్డి ఎన్నిక కావడం పట్ల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం పీఏసీఎస్ కార్యాలయం ఎదుట బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొణతం చిన వెంకట్‌రెడ్డి, జెడ్పీటీసీ రాపోలు నర్సయ్యలు రమణారెడ్డిని శాలువాతో సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కట్టా రామారావు, జ్యోతి, బాబు, చింతమళ్ల సైదులు, పారేపల్లి సత్యనారాయణ, శ్రీనివాస్‌రావు, వెంకన్న, మనోజ్, వెంకట్‌రెడ్డి, నాగరాజు, బోరిగల నాగరాజు ఉన్నారు.

18 నుంచి పదవ తరగతి పరీక్షలు



పోలీస్ స్టేషన్‌లో ప్రశ్నపత్రాలను భద్రపరుస్తున్న ఎంఈఓ చత్రునాయక్, తదితరులు

నేరేడుచర్ల : ఈ నెల 18వ తేదీ నుంచి ఏప్రిల్ 2 వరకు పదవ తరగతి పరీక్షలు నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి ఛత్రునాయక్ అన్నారు. పదవ తరగతి పరీక్షల రెండవ సెట్ ప్రశ్నప్రతాలు సోమవారం నేరేడుచర్లలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు చేరాయి. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో ప్రశ్నపత్రాలను భద్రపరిచి అనంతరం ఆయన మాట్లాడారు. నేరేడుచర్ల, పాలకీడు మండలాల్లో 19 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 645 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. నేరేడుచర్లలోని ప్రభుత్వ పాఠశాలతో పాటు శ్రీవాణి, ప్రగతి పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పట్టణంలోని మూడు సెంటర్లలో 39 మంది ఇన్విజిలేటర్లు, ముగ్గురు డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, ఒక చీఫ్ సూపరింటెండెంట్‌ను నియమించినట్లు పేర్కొన్నారు.

పరిశ్రమల్లో భద్రతా నిబంధనలు పాటించాలి

మేళ్లచెరువు : పరిశ్రమల్లో భద్రతా నిబంధనలు పాటించాలని డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శ్రీదేవి అన్నారు. సోమవారం మేళ్లచెరువు మండల కేంద్రం పరిధిలోని మైహోం సిమెంట్ పరిశ్రమలో సోమవారం నిర్వహించిన 53వ భద్రతా వారోత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆమె ప్లాంట్ హెడ్ శ్రీనివాసరావుతో కలిసి మాట్లాడారు. జీరో యాక్సిడెంట్ విధానంలో పనిచేసి మంచి ఉత్పత్తిని సాధించాలన్నారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ డాక్టర్ నాగేశ్వరరావు, సేఫ్టీ హెడ్ సూర్యనారాయణ, వేణునాయుడు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

పరిమితికి మించి తరలిస్తే చర్యలు



పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్న ఆటోను సీజ్ చేస్తున్న ఎస్‌ఐ

మోతె : ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయని మోతె ఎస్‌ఐ యాదవేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మోతె మండల కేంద్రంలో సూర్యాపేట– ఖమ్మం జాతీయ రహదారిపై ఆయన వాహణాల తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలో పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్న మూడు ఆటోలను పట్టుకొని సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ పట్టుబడిన ఆటోలను సూర్యాపేట జిల్లా మోటార్ వెహికిల్ అధికారికి అప్పజెప్తామన్నారు. ఆటల్లో పరిమితికి మించి తరలిస్తే ఆటో డ్రైవర్లపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వాహణదారులు డ్రైవింగ్ లైసెన్స్, ఆర్‌సీలను విధిగా వెంట ఉంచుకోవాలన్నారు. ఆయన వెంట మోతె పోలీసులు ఉన్నారు.

హైకోర్టు ఏజీపీ, జేఎల్‌లకు సన్మానం



ఏజీపీ, జేఎల్‌లను సన్మానిస్తున్న నాయకులు

హుజూర్‌నగర్ : ఇటీవల హైకోర్టు ఏజీపీగా నియమితులైన హుజూర్‌నగర్‌కు చెందిన లచ్చిమళ్ల సందీప్, గురుకుల జూనియర్ లెక్చరర్లు కస్తాల వెంకటరమణ, కస్తాల రమేష్‌లను సోమవారం హుజూర్‌నగర్ పట్టణంలోని టౌన్‌హాల్‌లో శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ పట్టణ, నియోజకవర్గ అధ్యక్షులు కస్తాల సైదులు, కుక్కల నాగరాజు, మాజీ జెడ్పీటీసీ గల్లా వెంకటేశ్వర్లు, బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పోతుల జ్ఞానయ్య, నాయకులు బెంజి, జి.రాములు, రాము, బాబురావు, రవి, సావిత్రి, రాము, శ్రీను, వీరబాబు, శోభన్, అరుణ్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నారసింహుని నిత్యకల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని సోమవారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిత్య హోమం పూర్తిగావించి శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా అందంగా ముస్తాబు చేసి ఎదుర్కోళ్ల మహోత్స సంవాదం రసవత్తరంగా రక్తిగట్టించారు. కల్యాణతంతులో భాగంగా విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాభందనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగల్యధారణను తలంబ్రాల మహోత్సవంతో నిర్వహించారు. అదేవిధంగా శ్రీస్వామి అమ్మవార్లను గరుడ వాహనంపై ఆలయ తిరుమాడవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అంతేగాక మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా క్షేత్రంలోని శివాలయంలో గల శ్రీపార్వతీరామలింగేశ్వరునికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, అద్దేపల్లి లక్ష్మణాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఫణిభూషణ మంగాచార్యులు, ఆంజనేయాచార్యులు, దుర్గాప్రసాద్‌శర్మ, నాగభూషణం, సీతారామాచార్యులు, రాజేష్, భక్తులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ పదవి గిరిజనులకు ఇవ్వాలి



మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డితో హుజూర్‌నగర్ గిరిజన నాయకులు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ నియోజకవర్గంలో గిరిజన జనాభా ఎక్కువ ఉన్నందున తమ సామాజిక వర్గానికి బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ పదవి ఇవ్వాలని ఆ సంఘం ముఖ్య నాయకులు కోరారు. ఈమేరకు సోమవారం హైదరాబాద్‌లో మాజీ మంత్రి జగదీశ్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ విషయమై మాజీ మంత్రి సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. కార్యక్రమంలో గిరిజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ్ సహకారంతో గ్రామాల అభివృద్ధికి కృషి



చౌటపల్లిలో సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న నాయకులు, అధికారులు

మఠంపల్లి : మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ చౌటపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు కొండేటి రామిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సింగారపు అరుణాసైదులు అన్నారు. సోమవారం మండలంలోని చౌటపల్లిలో గల బీఆర్‌ఆర్ కాలనీలో మంత్రి ఉత్తమ్ సహకారంతో మంజూరైన రూ.5లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను వారు ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు మోడె లింగయ్య యాదవ్, ఆవుల వెంకటనారాయణ, శంభయ్య, కాటయ్య, కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు మంజూరు చేయాలి

మునగాల : భవన నిర్మాణ కార్డు ఉన్న ప్రతి కార్మికుడి కుటుంబానికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసే విధంగా ఎమ్మెల్యే పద్మావతి, జిల్లా మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి కృషిచేయాలని మండల భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కోల ఆంజనేయులు కోరారు. సోమవారం ఆయన మునగాలలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

రాజ్యాంగ విలువలను దిగజారుస్తున్న మోదీ

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ఎన్నికల వ్యవస్థను, రాజ్యాంగ విలువలను దిగజార్చే రీతిలో మోదీ ప్రభుత్వం వ్యవహరిస్తుందని, సుప్రీంకోర్టు ఆదేశం ప్రకారం ఎస్‌బీఐ చైర్మన్‌ను వెంటనే అరెస్టు చేసి ఎన్నికల బాండ్ల వివరాలను బహిర్గతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సూర్యాపేట పట్టణంలోని ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మ ట్టిపల్లి సైదులు, కోట గోపి, డీవైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్, వెంకటరెడ్డి, నరసింహారావు ఉన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యం



పల్లె దవాఖానా శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీపీ శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్ఓ

హుజూర్‌నగర్‌రూరల్ : పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ గూడెపు శ్రీనివాస్ అన్నారు. సోమవారం హుజూర్‌నగర్ మండలంలోని బూరుగడ్డలో రూ.20 లక్షలతో చేపట్టిన పల్లె దవాఖానా నిర్మాణానికి సంబంధించిన శిలాఫలకాన్ని డిప్యూటీ డీఎంహెచ్ఓ నిరంజన్‌తో కలిసి ఆయన ఆవిష్కరించి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే సైదిరెడ్డి కాంగ్రెస్ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించారని తెలిపారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టకుండా దోచుకోవడం, దాచుకోవడమే పనిగా పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. బూరుగడ్డలో హడావుడిగా పేదలకు ఇంటి స్థలాలు పంపిణీ చేశారని కానీ డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వలేదని ఆరోపించారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో అన్ని గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపిస్తామని తెలిపారు. వేసవి దృష్ట్యా అధికారులు గ్రామాల్లో తాగునీటి ఇక్కట్లు రాకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ దొంగరి వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ లావణ్య, మండల వైద్యాధికారిణి పుష్పలత, డీటీ కమలాకర్, జీపీ స్పెషల్ అధికారి శ్రీనివాస్, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు నిజాముద్దీన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్, శివారెడ్డి, సత్యనారాయణ, లింగయ్య, నర్సింహారావు, భిక్షం, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ

గరిడేపల్లి : దీర్ఘ, స్వల్పకాలిక రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ అన్నారు. సోమవారం గరిడేపల్లి మండలంలోని కీతవారిగూడెంలో గల రాయినిగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో నిర్వహించిన డైరెక్టర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భూమి పాస్ బుక్ ఉన్న రైతులకు ఎకరానికి రూ. 45 వేల చొప్పున వ్యవసాయ రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ భూమి ఉండి సహకార సంఘంలో సభ్యత్వం లేని రైతులు రూ. 5 వందలు చెల్లించి సభ్యత్వం పొందాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్, వైస్ చైర్మన్లు ముప్పారపు రామయ్య, బొల్లేపల్లి రామనాథం, డైరెక్టర్లు చనగాని సాబంయ్య, బానోతు సైదులు, సుకన్య, నర్సమ్మ, రజిత, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, కృష్ణ, సీఈఓ కనకయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల మెనూ చార్జీలు పెంచాలి



మాట్లాడుతున్న షేక్ యాకుబ్

గరిడేపల్లి : పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థుల మెనూ చార్జీలు పెంచాలని సీపీఎం మండల కార్యదర్శి షేక్ యాకుబ్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంఎస్ భవనంలో మధ్యాహ్న భోజన కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గుడ్డుకు ప్రభుత్వం రూ.5 ఇస్తుందని కానీ కార్మికులు రూ.ఆరున్నరకు కొనుగోలు చేయాల్సి వస్తుందని వాపోయారు. గత ఐదు నెలలుగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, 3 నెలలుగా జీతాలు రావడం లేదని ఆయన తెలిపారు. మధ్యాహ్న భోజన కార్మికులకు గౌరవ వేతనం రూ. 10 వేలు ఇవ్వాలన్నారు. వెంటనే పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని, ఏజన్సీలకు గ్యాస్ సప్లైయితో పాటు యూనిఫామ్, వంటగది నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు నాగేంద్ర, వెంకటరమణ, నాగమణి, సుజాత, జానకమ్మ, లలిత, గౌతమి, అంజమ్మ, పుల్లమ్మ తదితరులు ఉన్నారు.